Disclaimer: we collected these articles from Internet part of Social Awareness Campaign, we are thankful to the creators. We use for non-profit, free education purpose only. To know more, please visit: www.freegurukul.org

# జీవజాతుల పరిరక్షణే అభివృద్ధికి మార్గం

www.freegurukul.org



ఆర్థిక అభివృద్ధి మాత్రమే లక్ష్యంగా కొనసాగుతున్న ప్రస్తుత తరుణంలో పర్యావరణం, అందులో నివసించే జీవజాతులు పెనుముప్పును ఎదుర్కొంటున్నాయి. జీవుల మనుగడ ప్రారంభమైన తరువాత ఇప్పటివరకు ఐదు మహావిపత్తులు సంభవించాయి. మానవుడు దురాశతో పర్యావరణాన్ని కుళ్ళబొడచడాన్ని ఆర్థికాభివృద్ధి పేరుతో ఇలాగే కొనసాగిస్తే ఆరో మహావిపత్తు జీవజాతులకు సంభవిస్తుందని పర్యావరణ శాస్త్రవేత్తలు ఆందోళన చెందుతున్నారు. ఈ ఆరో విపత్తు సంభవిస్తే మాత్రం భూమి మీద జీవవైవిధ్యంలో చాలా తుడిచిపెట్టుకు పోతుంది. ఇలాంటి విపత్తులను నియంత్రించాలంటే ఆర్థికాభివృద్ధి సూత్రాలు, నిర్వచనాలు మారాలి. సుస్థిరాభివృద్ధి దిశగా ఆర్థికాభివృద్ధి అడుగులు వేస్తే జీవవైవిధ్యం కొనసాగుతుంది. భూమి మీద అనేక జీవావరణాలను మానవుడు నాశనం చేస్తున్నాడు. పర్యావరణ పరిరక్షణలో మానవుడు ప్రతినాయకుడి పాత్ర పోషిస్తున్నాడు. ఈ వింత వైఖరి పారిశ్రామిక విప్లవం తదనంతర కాలం నుంచి ప్రారంభమయ్యింది. వాణిజ్య సంస్కృతి మొదలయిన తరువాత మానవుడు పంచభూతాలను కొల్లకొడుతున్నాడు. దీనివలన జంతువుల ఆవాసాలు దెబ్బతిని జీవజాతులు మానవుడి దెబ్బకు కుదేలవుతున్నాయి. ముఖ్యంగా అనేక జీవజాతులకు నెలవైన భారతదేశంలో పర్యావరణ సమతుల్యత వేగంగా దెబ్బతింటోంది. ఎడారులు, హిమాలయాలు, మడ అడవులు, సతతహరితారణ్యాలు, చిత్తడి నేలలు లాంటి వైవిధ్యమైన జీవావరణాలున్నాయి. ఈ ఆవాస విస్తృతిలో వచ్చే ఏ చిన్నపాటి మార్పైనా రుతుపవనాల మీద ప్రభావం చూపిస్తుంది. ఈ ఆవాసాలన్నీ మానవ కార్యకలాపాల వల్ల క్షీణిస్తున్నాయి. గతేడాది సర్వేల ప్రకారం జీవజాతులు సాధారణ శాతం కంటే కూడా వేయిరెట్లు వేగంగా అంతరించిపోతున్నాయి. ఎన్నో పక్షిజాతులు, క్షీరదాలు విలుప్తమయిపోతున్నాయి. గతంలో వచ్చిన మహాప్రళయాలన్ని అంతరిక్షంలో దారితప్పిన ఆస్టరాయిడ్ లాంటి శిలలు భూమిని తాకడం వల్ల జరిగితే, ఇప్పుడు రాబోయే ఆరవ విపత్తు కేవలం మానవుడి బాధ్యతా రాహిత్యం వల్ల రాబోతున్నది. అడవుల నరికివేత, కర్బన పదార్థాల ఉద్గారం, కాలుష్యం, పెరుగుతున్న భౌగోళిక ఉష్ణోగ్రతలు ఇవన్నీ కూడా జీవజాతులు అంతరించిపోవడానికి కారణమవుతున్నాయి. చివరకు ఎంతో జీవన సామర్థ్యం కలిగిన కీటక జాతులు కూడా అంతరించిపోతున్నాయి.

హిమాలయాలు కరుగుతున్నాయి....సముద్రాలు ఇంకుతున్నాయి. ఎడారీకరణ వేగం పుంజుకుంటున్నది. అడవుల శాతం దారుణంగా పడిపోయింది. పిచ్చుకలు, తేనెతుట్టెలు కనిపించకుండా పోతున్నాయి. గత అరవై మిలియన్ సంవత్సరాలలో ఎప్పుడు లేనంతగా వాతావరణ మార్పులు చోటుచేసుకుంటున్నాయి. సముద్రపు గవ్వలు గుల్లబారి పోతున్నాయి. ఆర్కిటిక్ ప్రాంతపు మంచు కరిగిపోతున్నది. పగడపు దీవుల రంగులు వెలసిపోతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా 40 శాతం పక్షులు, బల్లులు అంతరించిపోయాయి. ప్రతి ఏడాది 200 నుంచి 2000 జంతు జాతులు అంతరించిపోతున్నాయని శాస్త్రవేత్తలు అంచనా వేశారు. 2050 నాటికి చిరుతలు, ధ్రువపు ఎలుగుబంట్లు, ఖడ్గమృగాలు, చాలా రకాల తాబేళ్లు కనపడకుండాపోతాయి. ఇవన్నీ కూడా మానవుడి చేతిలోనే హతం అవుతుండడం ఒక విషాదకరమైన అంశం. మానవుడి విశృంఖలత్వం ఇలాగే కొనసాగితే ప్రకృతి పగ తీర్చుకోవడం తథ్యం. ప్రకృతి సమతుల్యతను దెబ్బతీస్తే దాని ఫలితం తీవ్రంగా ఉంటుదని అనేకసార్లు నిరూపితమైంది. కొన్ని సంవత్సరాల క్రితం కేదారనాథ్‌లో వచ్చిన వరదలు అక్కడ కట్టిన హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్ట్స్ వల్ల ఉధృత రూపం దాల్చాయని పర్యావరణ శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. అలాగే విశాఖలో హుదూద్ తుఫాన్ వచ్చినప్పుడు విమానాశ్రయం తీవ్రంగా దెబ్బతినడానికి కారణం అక్కడ ఉన్న మడ అడవులను నరికి విమానాశ్రయం నిర్మించడమే అని నిపుణులు తేల్చారు. మడ అడవులు తుఫాను గాలుల వేగాన్ని తగ్గిస్తాయి. వాటిని నరికి విమానాశ్రయం నిర్మించడంతో ప్రకృతి విపత్తు తీవ్రత పెరిగింది. ఒకప్పుడు ప్రతి రాష్ట్రంలో పవిత్ర వనాల పేరుతో అడవులను సంరక్షించేవారు. కానీ ఇప్పుడు అడవుల నరికివేత ఎ



క్కువగా జరుగుతున్నది. అరణ్యాలు జనారణ్యాలుగా మారుతున్నాయి. ఎర్రచందనం లాంటి వాటి కోసం అడవులను కొల్లగొడుతున్నారు. శేషాచలం కొండల్లో అడవులు ఈ ముష్కరుల దుందుడుకు చర్యల వల్ల తగలబడిపోయాయి. శేషాచలం కొండలు, నల్లమల అడవులు జీవవైవిధ్య నెలవులు. అటువంటి అడవులు నాశనం అయితే చాలా జీవజాతులు అంతరించిపోతాయి. మన రాష్ట్రంలో శేషాచలం కొండల్లో మాత్రమే కనిపించే బెట్లుడత, స్లెండర్ లోరిస్, బంగారుబల్లి లాంటివి అరుదైన జాతులుగా గుర్తించబడ్డాయి. వీటి రక్షణ కేవలం శేషాచలం అడవులను కాపాడడం ద్వారా మాత్రమే సాధ్యం. ఇక పశ్చిమ కనుమలు ఈ రోజుకీ జీవవైవిధ్యాన్ని అత్యధిక శాతం కలిగి ఉన్నాయి. ఈ కొండలను తొలిచి రైలు మార్గాలు వేయడం, ప్రాజెక్ట్స్ నిర్మించడం జీవవైవిధ్యానికి ముప్పును కలుగజేస్తాయి. పుష్పజాతులు కూడా చివరకు అంతరించిపోతున్నాయి. దీనివల్ల మకరందం దొరకక తేనెటీగలు, సీతాకోక చిలుకలు కనుమరుగవుతున్నాయి. ఆధునిక దేవాలయాలుగా నెహ్రూ పేర్కొన్న ఆనకట్టల వల్ల చేపల వలసలు తగ్గి వాటి జనాభా క్షీణదశకు చేరుతున్నది. మరపడవలలో విచక్షణా రహితంగా లాభాపేక్షతో టన్నుల కొద్దీ చేపలు పట్టడం వల్ల చేపల సంతానోత్పత్తి తగ్గిపోతున్నది. సాగర కాలుష్యం వల్ల కొన్ని వందల తిమింగలాలు వొడ్డుకు చేరి మృతి చెందుతున్నాయి. తాబేళ్లు కనుమరుగవుతున్నాయి. ముఖ్యంగా నక్షత్ర తాబేళ్లు ఎక్కువగా వేటాడబడుతున్నాయి. చర్మం కోసం పాములను, కొమ్ము కోసం ఖడ్గమృగాన్ని, గోళ్ళ కోసం పులులను, లేహ్యాల కోసం పిచ్చుకలను, దంతాల కోసం ఏనుగులను చంపుతున్నారు. మంచుయుగంలో ఉన్న అతి పెద్ద ఏనుగు అయిన మమ్మోత్ మానవుడు వేటాడడం వల్లే అంతరించి పోయిందని భావిస్తున్నారు. ప్రస్తుత నాగరికయుగంలో ఆహారం కోసం కవిలి కోడి లాంటి అరుదైన జాతులను వేటాడుతుండడం శోచనీయం. తిరుపతి లాంటి క్షేత్రాలలో భక్తులకు పర్యావరణం పట్ల అవగాహన సదస్సులు నిర్వహించాలి. ప్రయాణికుల తాకిడి వల్ల శేషాచలం అడవులలో నీటి వనరులు తగ్గిపోతున్నాయి. దీనివలన చాలా జీవజాతులు నీరు లభించక మరణిస్తున్నాయి. ఇలాంటి ప్రదేశాలలో భక్తుల సంఖ్య మీద, నీటి వాడకం మీద రేషన్ విధించడం మంచిది. బెంగళూరు లాంటి నగరాలు తీవ్ర మంచినీటి ఎద్దడిని ఇప్పటికే ఎదుర్కొంటున్నాయి. దీనికి కారణం చెరువులు కబ్జా చేసి నిర్మాణాలు కట్టడమేనని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. బహుళ అంతస్తు నిర్మాణాలు భూగర్భ జలాల మీద ఒత్తిడి పెంచుతున్నాయి. చెరువుల పూడికతీతలో

**పూర్వీకులలో ఉండే జీవకారుణ్యం మనకు ఆదర్శం కావాలి. పవిత్ర వనాల సంఖ్య పెంచాలి. పర్యావరణ హిత కార్యక్రమాలను చేపట్టాలి. కాలుష్య వ్రణాలతో కుదేలవుతున్న పర్యావరణాన్ని కాపాడి జీవజాతులను రక్షించకుంటే మానవాళి భారీమూల్యం చెల్లించక తప్పదు. జీవవైవిధ్యాన్ని కాపాడే సుస్థిర అభివృద్ధినే ప్రభుత్వాలు ప్రోత్సహించాలి.**

గ్రామీణజనం పాలుపంచుకునేలా చేయాలి. నీటి సదస్సులు నిర్వహించాలి. పుష్కరాల లాంటివి ఒకప్పుడు నదులను కాపాడుకునే ఉద్దేశ్యంతో ప్రారంభమయ్యాయి. ఇప్పుడు అవే పుష్కరాలు నదీజలాల కాలుష్యానికి కారణమవుతున్నాయి. వేసవిలో మనుష్యులకు నీరు దొరకడమే మృగ్యమైతే ఇక జంతువుల పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందో అంచనా వేయవచ్చు. నీటి కోసం అడవి జంతువులు జనావాసాలలోకి ప్రవేశించడం వల్ల మానవుడికి వాటితో సంఘర్షణ మొదలైంది. ఈ సమస్యకు పరిష్కారం అడవులలో నీటి నిల్వలను పెంచడమే. సాగునీరు, తాగునీరు అందజేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అయినా, నీటిని పొదుపుగా వాడాల్సిన బాధ్యత ప్రజలదే. చెరువులు ఎండిపోవడం వల్ల, జలచర జీవుల వైవిధ్యం వేగంగా తగ్గిపోతున్నది. యేరు ఉంటేనే వూరు ఉంటుంది అనే విషయం ప్రజలు, ప్రభుత్వాలు గుర్తిస్తే మంచిది. గుర్రపుడెక్క లాంటి కలుపు మొక్కల వల్ల జలావరణం, పార్థీనియం లాంటి వాటి వల్ల పర్యావరణం దెబ్బతింటున్నాయి. వీటిని తొలగించి జీవవైవిధ్యాన్ని కాపాడాలి.

చివరికి వాణిజ్య సంస్కృతి ఆర్కిటిక్ ప్రాంతాన్ని కూడా వదలడం లేదు. సహజ వాయువు కోసం, పెట్రోలియం నిల్వల కోసం ఆర్కిటిక్ ప్రాంతంలో ప్రారంభమైన తవ్వకాల వల్ల, అక్కడ పెరుగుతున్న రవాణ వాహనాల రాకపోకల వల్ల మంచు కరుగుతున్నది. ఆర్కిటిక్ ప్రాంత మంచు ప్రపంచ మంచినీటి అవసరాలను పెద్ద ఎత్తున తీరుస్తున్నది. ఈ మంచు ఖండాలను నాశనం చేయడం వల్ల ధ్రువపు ఎలుగుబంటి, సీల్ లాంటి జాతుల, పెంగ్విన్ పక్షుల జనాభా తగ్గుముఖం పడుతున్నాయి. జీవజాలం అంతా జలం మీదే ఆధారపడి ఉంది. ధ్రువ ప్రాంత పరిరక్షణకు ప్రపంచ దేశాలు నడుం బిగించాలి. ముఖ్యంగా అభివృద్ధి చెందిన దేశాలు ఎక్కువగా కాలుష్యాన్ని కలగజేస్తున్నాయి కాబట్టి ఆ దేశాల పౌరులలో పర్యావరణ స్పృహ కలిగించాల్సిన బాధ్యత ఆ దేశ అధినేతల మీద ఉంది. కొన్నిదేశాలలో జాతీయ పక్షులు అంతరించి పోయాయంటే జీవజాతుల విలుప్తత ఎంత తీవ్రంగా ఉందో అంచనా వేయవచ్చు. మారిషస్ జాతీయ పక్షి డూడూ అంతరించి పోవడం దీనికి నిదర్శనం. పెద్ద పులికి మించిన క్రూరజంతువుగా మనిషి రూపాంతరం చెందుతున్నాడనడానికి నిదర్శనంగా చెప్పుకోవచ్చు. గ్రామీణ ప్రాంతాలలో ఎలుగుబంటి పిల్లలతో వ్యాపారం చేస్తున్నారు. అనంతపురం జిల్లాలో గత 125 సంవత్సరాలలో 65 కరువు సంవత్సరాలు వచ్చాయని ప్రభుత్వ వర్గాలు అంచనా వేశాయి. ఈ తీవ్ర దుర్భిక్ష పరిస్థితుల వల్ల జిల్లావ్యాప్తంగా క్షీరదాల వైవిధ్యానికి ముప్పు వాటిల్లుతున్నది. ఈ జిల్లాలో పరిశోధకుల అంచనా ప్రకారం 24 జాతుల క్షీరదాలు ముప్పు బారిన పడబోతున్నాయి. అనంతపురం జిల్లా ఎడారీకరణకు గురవుతుండడంతో జీవజాతుల విలుప్త వేగం ఎక్కువగా ఉంది. మారుతున్న వాతావరణం, విఫలమవుతున్న రుతుపవనాలు ఇవన్నీ కూడా దేశ వ్యాప్తంగా జీవజాతుల మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్నాయి.

వ్యవసాయంలో వస్తున్న మార్పులు కూడా జీవజాతుల విలుప్తతకు దారి తీస్తున్నది. వ్యవసాయంలో రసాయనాల వాడకం పెరగడంతో వానపాముల జనాభా క్షీణిస్తున్నది. ఇది ఇలాగే కొనసాగితే మృత్తిక నాణ్యత తగ్గే ప్రమాదం ఉంది. క్రిమి సంహారక మందుల వల్ల పక్షి గుడ్ల పెంకులు పెళుసుగా తయారవుతున్నాయి. దీని వలన పొదిగే సమయంలో గర్భస్థ పిండాలు చనిపోతున్నాయి. హిమాలయాలలో 163 జాతులు విలుప్తం కాబోతున్నాయి. 900 పక్షిజాతులకు, 300 క్షీరద జాతులకు హిమాలయాలు ఆవాసాన్ని కల్పిస్తున్నాయి. హిమాలయ ప్రాంతంలో మాత్రమే కనిపించే మంచుపులి త్వరలో అంతరించబోతున్నది. కొండ గొర్రెల జనాభా కూడా తగ్గుముఖం పడుతున్నది.

చెట్లు అంతరిస్తూ ఉండడంతో గొంగళిపురుగు దశలకు ఆహారం దొరకడం దుర్లభంగా ఉంది. గనుల తవ్వకం పర్యావరణం మీద మరో గుదిబండగా మారి జీవజాతుల దుంప తెంచుతూ ఉంది. 58 మిలియన్ సంవత్సరాల క్రితం వాతావరణ మార్పుల వల్ల అంతరించిన టిటనో బోవా అనే సర్పంలాగా, ప్రస్తుతం అనేక సర్పాలు ఆవాస క్షీణత వల్ల అంతరించి పోబోతున్నాయి. సర్పాలు ఎంత భయంకర ప్రాణులయినప్పటికీ, ఎలుకల జనాభాను నియంత్రిచడంలో ముఖ్య పాత్రను పోషిస్తాయి. అటువంటి సర్ప జాతుల విలుప్తత ఆహారపు గొలుసుల సమతుల్యతను దెబ్బతీస్తోంది. సేంద్రియ, సంప్రదాయ వ్యవసాయ పద్ధతులను అనుసరించాల్సిన అవసరం ఉన్నది. పూర్వీకులలో ఉండే జీవకారుణ్యం మనకు ఆదర్శం కావాలి. పవిత్ర వనాల సంఖ్య పెంచాలి. పర్యావరణ హిత కార్యక్ర మాలను చేపట్టాలి. కాలుష్య వ్రణాలతో కుదేలవుతున్న పర్యావరణాన్ని కాపాడి జీవజాతులను రక్షించకుంటే మానవాళి భారీ మూల్యం చెల్లించక తప్పదు. జీవవైవిధ్యాన్ని కాపాడే సుస్థిర అభివృద్ధినే ప్రభుత్వాలు ప్రోత్సహించాలి.

◆ జీఎల్ఎన్ ప్రసాద్
9441450987